TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 220 | శుక్రవారం 29 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

### 'గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియా'గా

## గండికోట అభివృద్ధి



**ఢిల్లీ:** కడప జిల్లాలోని గండికోటను పర్యాటక ప్రదేశంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. 'గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియా'గా గండికోటను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 'నాకు గండికోట ఒక ప్రత్యేక ప్రాజెక్టు. మా పూర్వీకుల ప్రదేశంగా గండికోటకు పేరు ఉంది' అని అన్నారు. రాష్ట్రంలోని ఒక్కొక్క ప్రాజెక్టును చేపట్టి.. వాటిని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## ఆరు నెలల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్: మంత్రి టీజీ భరత్



**కర్నూలు:** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. "వైకాపా ప్రభుత్వం న్యాయరాజధాని పేరుతో ప్రజల్ని మోసం చేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ పెడతామని మాత్రమే ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అసెంబ్లీలో ప్రకటనకు ముందే బెంచ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాం. బెంచ్ శాశ్వత భవన నిర్మాణానికి ఏడాదిన్నర పట్టొచ్చు. ఆరు నెలల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది. లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాలూ కర్నూలులోనే ఉంటాయి. కర్నూలు నుంచి కార్యాలయాల తరలింపు అనేది వైకాపా దుష్ప్రచారమే" అని మంత్రి తెలిపారు.



# మహిళలు సమాన అవకాశాల కోసం పోటీ పడాలి!

**త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి**

**విల్లివాకం న్యూస్:** మహిళలు వృత్తిపరమైన మరియు వ్యక్తిగత రంగాలలో సమాన అవకాశాల కోసం పోటీ పడాలని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి తెలిపారు. శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ గురువారం ప్రత్యేక మహిళా సాధికారత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎయిడెడ్ పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ సోలేటి లోకయ్యన్ సుదర్శనం స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఎస్కేపిసి గౌరవ కరస్పాండెంట్ వూటుకూరు శరత్ కుమార్, ఎస్కేపిడి మరియు ఛారిటీస్ కార్యకలాపాలు, మహిళల విద్య మరియు సాధికారతను రూపొందిం చడంలో ఎస్కేపి కళాశాల పాత్రను హైలైట్ చేశారు. ముఖ్య అతిథి పరిచయాన్ని ఆర్థిక శాఖ ఇన్చార్జి సభ్యుడు సి.ఆర్.కిషోర్ బాబు గావించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఫరిష్టే - యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్ ప్రోగ్రామ్ కోసం సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు. యంగ్ ఇండియన్స్ సహకారంతో అమలు చేయబడిన ఈ విశిష్ట చొరవ, ఎస్కేపిసిని భారత దేశంలోని మొట్టమొదటి కళాశాలగా మార్చింది. ఇక్కడ విద్యార్థులందరూ అత్యవసర ప్రతిస్పందన దారులుగా శిక్షణ పొందారు. ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స మరియు సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. తన ప్రసంగంలో, గవర్నర్ మహిళా సాధికారతపై ఆలోచింపజేసే ప్రసంగం చేశారు, మహిళలు తమ సామర్థ్యాన్ని గ్రహించాలని మరియు వృత్తిపరమైన మరియు వ్యక్తిగత రంగాలలో సమాన అవకాశాల కోసం పోటీ పడాలని కోరారు. దేవస్థానం ఇన్చార్జి సభ్యుడు దేసు లక్ష్మీ నారాయణన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమం ఎస్కేపిసి విద్యార్థినులకు మహిళలకు సాధికారత కల్పించ డానికి, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి వీలు కల్పించింది.





## మహిళా కానిస్టేబుల్ కుటుంబానికి సీఎం స్టాలిన్ సాయం



**విల్లివాకం న్యూస్:** ముఖ్య మంత్రి ఎం.కె.స్టాలిన్ ఒక పత్రికా ప్రకటనలో ఇలా తెలిపారు. పుదుకోట్టై జిల్లా మండయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో లేడీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విమల గురువారం ఉదయం పుదుకోట్టై-తిరుచ్చి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న నాలుగు చక్రాల వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విమల కుటుంబానికి, ఆమె బంధువులకు మరియు సహోద్యోగులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను మరియు ఆమె కుటుంబానికి రూ.25 లక్షల సహాయ నిధిని అందించాలని ఆదేశించాను.

## విశ్వకర్మ పథకంతో ప్రయోజనం



**విల్లివాకం న్యూస్:** బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ఒక ప్రకటనలో ఇలా తెలిపారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంకుల ఆధారిత పరిశ్రమల వ్యవస్థను పటిష్టం చేస్తుంది. సామాజిక న్యాయం ఆధారంగా తమిళ నాడు ప్రభుత్వం తమిళనాడులోని హస్తకళా కారులకు సాధికారత కల్పించేందుకు సమగ్ర పథకాన్ని రూపొందించాలని నిర్ణయించింది. తమిళనాడు ప్రభుత్వం అమలు చేయనున్న ఈ కొత్త పథకం వల్ల రాష్ట్రంలోని చేతివృత్తుల వారికి కుల, కుటుంబ వృత్తులకు అతీతంగా పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

# ఎంపీగా ప్రమాణం చేసిన ప్రియాంక



**ఢిల్లీ:** కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఇటీవల కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఆమె.. గురువారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ, ఇతర నేతలు వెంట రాగా.. కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే 'కసావు' చీర ధరించి ప్రియాంక సభకు వచ్చారు. నేడు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగ ప్రతిని చేతబూని ఆమె ఈ ప్రక్రియను పూర్తిచేశారు.

ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ.. తొలి అడుగులోనే భారీ విజయాన్ని నమోదు చేశారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో తన సమీప ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానంలో తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన (3.64 లక్షలు) మెజార్టీని ఆమె అధిగమించారు. ఎంపీ హోదాలో మొదటిసారి లోక్‌సభలోకి అడుగుపెట్టారు.

**వయనాడ్‌లో విజయంతో..** నెహ్రూ-గాంధీ కుటుంబంలో దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించిన మూడో వ్యక్తిగా ప్రియాంక గుర్తింపు పొందారు. ఇదివరకు ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ దక్షిణాది నుంచి ప్రాతినిధ్యం వహించారు. సోనియా గాంధీ కూడా కర్ణాటకలోని బళ్లారి నుంచి పోటీ చేసి విజయం సాధించినప్పటికీ.. అమేఠీలోనూ గెలిచిన ఆమె ఆ తర్వాత దాన్ని వదులుకున్నారు.

ఇక, ప్రియాంక రాకతో ఇప్పుడు ఒకేసారి ముగ్గురు నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులు పార్లమెంటు ఎంపీలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. రాహుల్ రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా ప్రియాంకతో పాటు నాందేడ్ ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ నేత రవీంద్ర వసంతరావ్ చవాన్ కూడా నేడు ప్రమాణం చేశారు.

## నైరుతి బంగాళాఖాతంలో స్థిరంగా తీవ్ర వాయుగుండం

-వివరాలు 2వ పేజీలో

# రాష్ట్రంలో స్కామ్‌ల పాలన బాధాకరం: వైఎస్ జగన్

**గుంటూరు : రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో బాధాకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. హామీల అమలు లేకపోగా.. స్కాంల పాలన నడుస్తోందని అన్నారాయన. గురువారం సాయంత్రం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.**

"నా పాదయాత్రలో కష్టాలను చూశా. అందుకు తగ్గట్లు.. గత ఐదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ప్రతీ ఇంటికి మంచి చేశాం. ఇప్పుడు ఆ అడుగులు వెనక్కి ఎలా వెళ్తున్నాయో చూస్తున్నాం.

..కూటమి పాలనలో తిరోగమనంలో ఇప్పుడు రాష్ట్రం ఉంది. రెడ్‌బుక్ పాలనతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. బడ్జెట్‌తో భరోసా ఇవ్వలేకపోయారు. లిక్కర్, ఇసుక స్కాంలతో పాటు.. ఎక్కడ చూసినా పేకాట క్లబ్‌లు కనిపిస్తున్నాయి. ఇది చాలా బాధాకరమైన పరిస్థితి..

రాష్ట్రంలో గత ఐదేళ్లలో విప్లవాత్మక అడుగులు పడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ అడుగులు వెనక్కు పడుతున్నాయి. సూపర్ సిక్స్‌లు కనిపించవు. ఎన్నికలప్పుడు చెప్పిన మాటలు కనిపించవు. రెడ్‌బుక్ పరిపాలనలో రాజ్యాంగానికి తూట్లు పొడవడమే కనబడుతోంది." అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ప్రజలకు మంచి చేయాలనే మేం ప్రతి అడుగు ముందుకు వేశాం. ఎన్నడూ ఊహించని మార్పులు తీసుకురాగలిగాం. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. లంచాలు, వివక్ష లేకుండా ప్రతి పథకం ఇంటి వద్దకే డోర్ డెలివరీ ఇచ్చాం. బడ్జెట్‌లో కేలండర్ ఇచ్చి మరీ పథకాలను అమలు చేశాం. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రమే జరిగింది." అని వైఎస్ జగన్ గుర్తు చేశారు.

**యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన:** రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎలా విప్లవాత్మక అడుగులు పడ్డాయి. ఇప్పుడు అవిఎలా వెనక్కు వెళ్తున్నాయో చెబుతాను. రాష్ట్రంలో ఈరోజు చాలా



బాధాకరమైన పరిస్థితులు. ఒక బడ్జెట్ ప్రవేశ పెట్టడం. దాని ద్వారా కాన్ఫిడెన్స్ ఇవ్వడం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు.. ఇవేవీ కనిపించడం లేదు. సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ లేదు. యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన. రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది. ప్రతి చోటా దోపిడి. ఒక మాఫియా సామ్రాజ్యం. పైస్థాయి నుంచి కింది వరకు ఎక్కడిక్కడ కమిషన్లు. దోపిడి.

**కష్టాలు స్వయంగా చూసి..:** గతంలో అసాధ్యం అనుకున్న మార్పులు మనం చేసి చూపగలిగాం. మేం తీసుకొచ్చిన ప్రతి మార్పు, నా సుదీర్ఘ 3648 కి.మీ పాదయాత్రలో ప్రజల కష్టాలు చూశాక, తీసుకున్న నిర్ణయాల ద్వారా జరిగింది. ప్రతి రంగంలో ఒక విప్లవం తీసుకొచ్చాం. ఊహించని మార్పులు తేగలిగాం. ప్రభుత్వ పథకాలు గ్రామాల్లోనూ డోర్ డెలివరీ చేశాం. ఆ విధంగా గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చాం. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ. వాలంటీర్ల వ్యవస్థ. దాదాపు 540 రకాల సేవలు అందించాం. ప్రతి ఇంటికి మంచి చేశాం. ఎక్కడా, లంచాలు, వివక్ష లేదు. క్యాలెండర్ ఇచ్చి మరీ పథకాలు అమలు చేశాం. ఇది దేశంలో ఎక్కడా జరగలేదు. ఏకంగా రూ.2.73 లక్షల కోట్లు నేరుగా బదిలీ చేశాం. ప్రతి ఇంటికి మేలు చేశాం. ఈరోజు మళ్లీ జన్మభూమి కమిటీలు వచ్చాయి. పథకాల కోత మొదలైంది. ఏ పని కావాలన్నా టీడీపీ నాయకుల ఇళ్ల తిరగాల్సిందే.

**విద్యా రంగం:** బడులు పూర్తిగా మార్చాం. ప్రైవేటుకు ధీటుగా వాటిని అభివృద్ధి చేశాం. ఇంగ్లిష్ మీడియమ్‌తో మొదలు పెడితే, సీబీఎస్ఈ, ఐబీ వరకు తీసుకొచ్చాం. 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ. డిజిటల్ క్లాస్‌రూమ్స్. ట్యాబ్‌లు, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, పూర్తి ఫీజు చెల్లింపు, అమ్మ ఒడి, మ్యాండేటరీ ఇంటర్న్‌షిప్ మొదలుపెడితే కరికులమ్‌లో మార్పులు. ఇలాంటి విప్లవాత్మక మార్పులన్నీ వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వచ్చాయి.

**వైద్య రంగం:** గ్రామంలోనే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దనే వైద్యం. విలేజ్ క్లినిక్స్, నాడు-నేడుతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఆస్పత్రులు బాగు పడ్డాయి. 52 వేల పోస్టులు భర్తీ చేసి జీరో వేకెన్సీ తెచ్చాం. రాష్ట్రంలో స్పెషలిస్టుల కొరత కేవలం 4 శాతం. అది జాతీయ స్థాయిలో 61 శాతం. 3300 చికిత్సలు ఆరోగ్యశ్రీలో. ఆరోగ్య ఆసరా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే. ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు మొదలైంది మా ప్రభుత్వ హయాంలోనే.

**వ్యవసాయ రంగం:** చేయి పట్టుకుని రైతులను నడిపించాం. ఈ-క్రాప్ వ్యవస్థ, ఆర్బీకేలు, దళారుల ప్రమేయం లేకుండా పంటల కొనుగోలు. అదే ఈరోజు అన్ని వ్యవస్థలు తిరోగమనమే. ప్రతి రోజూ రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెస్పీ కంటే దాదాపు రూ.400 కంటే తక్కువకు రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు. దళారుల చేతిలోనే అన్నీ.

**ఫీజు రీయింబర్స్‌మెంట్:** ప్రతి క్వార్టర్ అయిపోగానే, ఫీజులు చెల్లించేవాళ్లం. ఇప్పటికీ మూడు క్వార్టర్లు పూర్తి కాగా, జనవరికి నాలుగు క్వార్టర్లు. ఆ మేరకు పిల్లల ఫీజులు బకాయిలు. కాలేజీల్లో పిల్లలను వెనక్కు పంపుతున్నారు. బడులకు పోయే పిల్లలు పంట పొలాల్లో పని చేస్తున్నారు. రూ.2800 కోట్లు విద్యాదీవెన బకాయిలు. రూ.1100 వసతిదీవెన బకాయిలు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.2200 కోట్లు దాటాయి. ఆరోగ్య ఆసరా ఊసే లేదు. 108, 104 సర్వీసులు మూలనబడ్డాయి. వాలంటీర్లను తొలగించారు. వారికి రూ.10 వేలు ఇస్తామని పచ్చిగా మోసం చేశారు. అన్ని వ్యవస్థలు దారుణంగా వెనక్కు పోయాయి.

## ఆయుర్వేద మూలికలను వాడండి.. రోగాల నుంచి సురక్షితంగా ఉండండి..!

**చలి తీవ్రత కారణంగా అందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన చలి కారణంగా విపరీతమైన దగ్గు, జలుబుతోపాటు తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయితే ఈ అనారోగ్య సమస్యలు తగ్గేందుకు సహజంగానే చాలా మంది ఇంగ్లీష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. దీంతో సమస్య తాత్కాలికంగా తగ్గినా కూడా మళ్లీ వచ్చేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఇప్పుడు చెప్పబోయే ఆయుర్వేద మూలికలను ఈ సీజన్‌లో వాడితే దాంతో మీ రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. దగ్గు, జలుబు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక ఆ ఆయుర్వేద మూలికలు ఏమిటి అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.**

**తిప్పతీగ..** మన చుట్టూ పరిసరాల్లో తిప్పతీగ పెరుగుతుంది. దీని కాండం కాస్త మందంగా ఉంటుంది. అయితే తిప్ప తీగ ఆకులను తెచ్చి రసం తీసి తాగవచ్చు. రోజుకు రెండు సార్లు అర టీస్పూన్ చొప్పున తిప్పతీగల ఆకుల రసం తాగుతుంటే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఫలితంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఈ సీజన్‌లో పసుపును కూడా రోజూ వాడాలి.



పాలలో పసుపును కలుపుకుని రోజుకు రెండు సార్లు ఉదయం, సాయంత్రం తీసుకోవాలి. భోజనం అనంతరం ఇలా చేయాల్సి ఉంటుంది. పసుపులో సహజసిద్ధమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు, రోగాలనైనా తగ్గిస్తాయి. చలికాలంలో వచ్చే ఆర్థరైటిస్ నొప్పులను తగ్గించేందుకు కూడా పసుపు ఎంతగానో ఉపయోగపడుతుంది. కనుక ఈ సమస్యల నుంచి బయట పడాలంటే రోజూ పసుపు పాలను తాగాల్సి ఉంటుంది.


**తులసి ఆకులు..** శ్వాసకోశ సమస్యలను, సీజనల్ వ్యాధులను తగ్గించడంలో తులసి ఆకులు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. తులసి ఆకులను నాలుగు తీసుకుని ఉదయాన్నే పరగడుపునే అలాగే తినవచ్చు. లేదా తులసి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని కప్పు మోతాదులో ఉదయం, సాయంత్రం రెండు పూటలా తాగవచ్చు. ఇలా తులసిని తీసుకుంటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

**అశ్వగంధ..** శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేసి రోగ నిరోధక శక్తిని పెంచడంలో అశ్వగంధ కూడా అద్భుతంగా పనిచేస్తుంది. అశ్వగంధ చూర్ణం, ట్యాబ్లెట్లు కూడా మనకు మార్కెట్‌లో లభిస్తాయి. వీటిని డాక్టర్ సలహా మేరకు వాడుకోవచ్చు. అశ్వగంధ చూర్ణాన్ని పావు టీస్పూన్ మోతాదులో ఉదయం, సాయంత్రం గోరు వెచ్చని పాలలో కలిపి తాగితే శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుంది. అలాగే రోజూ ఉదయాన్నే పరగడుపునే రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను కాస్త దంచి నేరుగా అలాగే తినేయాలి. ఇవి ఘాటుగా ఉంటాయి కనుక వీటిని తినేటప్పుడు నాలుక మండకుండా ఉండేందుకు గాను కాస్త తేనెతో కలిపి వెల్లుల్లిని తినవచ్చు. ఇలా పలు రకాల మూలికలను తీసుకోవడం వల్ల చలికాలంలో వచ్చే అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

## అమరావతిలో 'ఈగల్' కేంద్ర కార్యాలయం

**అమరావతి:** రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం 'ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఈగల్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని అమరావతిలో కేంద్ర కార్యాలయం, జిల్లాల్లో యూనిట్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.అమరావతిలో నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్, 26 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు కానున్నట్టు హోంశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. గంజాయి, డ్రగ్స్ సరఫరా, రవాణా నియంత్రణ, నేరాల దర్యాప్తు, విచారణపై ఈగల్ ఫోర్స్ కార్యాచరణ చేపట్టనుంది. ఈగల్ టాస్క్ ఫోర్స్‌లో పనిచేసే సిబ్బందిని డిప్యుటేషన్‌పై తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈగల్ ఫోర్స్‌లో చేరిన యూనిఫాం సర్వీసు ఉద్యోగులకు 30 శాతం ప్రత్యేక అలవెన్సు ఇవ్వనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. గంజాయి, డ్రగ్స్ వ్యవహారాల్లో విచారణకు 5 ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఏపీ హైకోర్టుకు నివేదించినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఈగల్ ఫోర్స్‌కు ముందుగా రూ.8.59 కోట్లు కేటాయిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

## నైరుతి బంగాళాఖాతంలో స్థిరంగా తీవ్ర వాయుగుండం



**అమరావతి:** నైరుతి బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతానికి ట్రింకోమలీకి 100 కిలోమీటర్లు, నాగపట్నానికి 320, పుదుచ్చేరికి 410, చెన్నైకి 490 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. రానున్న 12 గంటల్లో శ్రీలంక తీరాన్ని దాటి తుపానుగా (%జఎశ్రీశిఅవ%) మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత, ఇది ఉత్తర-వాయువ్య దిశగా పయనించనుంది. శనివారం (నవంబర్ 30వ తేదీ) ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల వెంట కారైకాల్-మహాబలిపురం మధ్య తీవ్ర వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. దక్షిణకోస్తా తీరం వెంట గంటకు 35-45 కిలోమీటర్ల వేగంతో.. గరిష్టంగా 55 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.



# హేమంత్ సోరన్‌కు ఉదయనిధి శుభాకాంక్షలు

**విల్లివాకం న్యూస్:** జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు దశల్లో 20, 23 తేదీల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో జార్ఖండ్ ముక్తి మోర్చా 34 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. తదనంతరం, హేమంత్ సోరన్ గవర్నర్ సంతోష్ కంగ్వార్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి హక్కును పొందారు. ఆ తర్వాత గవర్నర్ ఆమోదంతో గురువారం నాలుగోసారి జార్ఖండ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్ సంతోష్ కుమార్ కంగ్వార్ హేమంత్ సోరన్‌తో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంలో, ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న తమిళనాడు డిప్యూటీ సిఎం ఉదయనిది స్టాలిన్ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఆత్మకథను ఆయనకు బహుమతిగా అందించారు. ఈ విషయాన్ని ఉదయనిధి స్టాలిన్ తన ఎక్స్ సైట్ పేజీలో పోస్ట్ చేశారు. మా డీఎంకే నాయకుడు మరియు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్




తరపున, జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనే అవకాశం నాకు లభించింది. జెఎంఎం ప్రెసిడెంట్ సోరెన్ మరియు అతని కొత్త మంత్రివర్గానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేసాను. జార్ఖండ్ అన్ని రంగాలు మరియు ప్రజలలో పురోగతిని కొనసాగిస్తోందన్నారు.

# ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు - చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ!

**అన్నా నగర్ న్యూస్:** బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు తాజాగా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేయబడింది. ఆర్మ్‌స్ట్రాంగ్‌ను గత ఏడాది జూలై 5న పెరంపూర్‌లో నరికి చంపిన ఘటన సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఉత్తర చెన్నైకి చెందిన రౌడీ నాగేంద్రన్‌తో సహా మొత్తం 28 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా, ఈ హత్య ప్రతీకార చర్యగా జరిగినట్లు భావిస్తున్నారు. గతేడాది రౌడీ అర్కాడు సురేష్‌ను హత్య చేసినందుకు ప్రతీకారంగా ఆర్మ్‌స్ట్రాంగ్‌ను చంపినట్లు విచారణలో వెల్లడి జరిగింది. ఈ కేసును ఇటీవల ఎగ్మోర్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. నిన్న జరిగిన విచారణలో కేసు సంబంధిత 27 మందిని కోర్టులో హాజరుపరిచారు. అలాగే, విచారణలో భాగంగా 5,000 పేజీల ఛార్జ్‌షీట్‌ను ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో



దాఖలు చేశారు. తదనంతరం కోర్టు విచారణను వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది.

మరోవైపు, ప్రధాన నిందితుడు రౌడీ నాగేంద్రన్ తనను వేలూరు జైలు నుంచి పుళల్ జైలుకు తరలించాలని కోర్టులో పిటిషన్ వేశాడు. తన కాలేయం దెబ్బతినడం వల్ల ఎక్కువ దూరం ప్రయాణించలేనని ఆ పిటిషన్‌లో పేర్కొన్నాడు. దీనిపై స్పందించాలంటూ కోర్టు జైలు అధికారులను ఆదేశించింది.

# చిన్ననాటి మిత్రుని కుటుంబానికి చేయూత



**గోదావరిఖని :** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన గోదావరిఖని కి చెందిన దేవసాని రాజ పాపయ్య కు ఆయన చిన్ననాటి స్నేహితులు జనగామ తిరుపతి మరియు అతని మిత్రబృందం అందరు కలిసి తలా కొంత అనుకుని దాదాపుగా నలభై వేల రూపాయలు జమచేసి వారి కూతురు పేరు మీద ఫిక్స్ చేసి ఇస్తాము అని భరోస ఇచ్చారు. ఈ మేరకు నేడు గోదావరిఖనిలో పెద్దకర్మ సందర్భంగా ముందుగా రాజ పాపయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎవరైనా మిత్రుని కుటుంబం ఆపదలో ఉన్నది అని తెలిస్తే మేమున్నాం అంటూ ఆదుకోవడానికి ముందుకు వస్తాం అని జనగామ తిరుపతి మిత్ర బృందం సభ్యులు ప్రకటించారు. తోచినంత సేకరించి ఆపదలో ఉన్న ఉన్న మిత్రులకే కాకుండ పేద కుటుంబాలకు అండగా నిలుస్తాం అని పెర్కొన్నారు. తోటి మిత్రుడు దేవాసాని రాజ పాపయ్య గుండెపోటుతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాల్యమిత్రుని భార్యకు, కూతురు కి మానసికంగా పాప భవిష్యత్తు గురుంచి ఆందోళన చెందుతున్న విషయాన్ని గమనించిన మిత్రులు స్పందించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు జనగామ తిరుపతి, కట్ట కుమారస్వామి, తమ్మిశెట్టి సంపత్, రామ్ శంకర్, దాసరి ఓదెలు, వెన్నెం శ్రీనివాస్, తాంద్ర సదానందం, తూడి సురేష్, పసుల అశోక్, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# నామ్ తమిళర్ పార్టీకి మరో ఎదురుదెబ్బ



**గిండీ న్యూస్:** గత కొన్ని రోజులుగా నామ్ తమిళర్ పార్టీ నుంచి ప్రముఖ నిర్వాహకులు ఒకరేమీగా పార్టీకి దూరమవుతున్నారు. తాజాగా, కోయంబత్తూరు జిల్లాలో నామ్ తమిళర్ పార్టీ ఉత్తర జిల్లా కార్యదర్శి పెరియకులం రామచంద్రన్‌తో పాటు నలుగురు పార్టీని వీడారు. సేలం వెస్ట్ జిల్లా కార్యదర్శి జగదీష్ కూడా తన రాజీనామాను అధికారికంగా ప్రకటించారు.

ఇటీవల, నామక్కల్ జిల్లా మాజీ కార్యదర్శి వినోద్ కుమార్ సహా మొత్తం 50 మంది పార్టీని వీడినట్లు ప్రకటించారు. ఈ సంఘటన పార్టీకి తీవ్రమైన దెబ్బగా భావిస్తున్నారు.

**మీడియాతో మాట్లాడుతూ, వినోద్ కుమార్ ఇలా అన్నారు:** "పార్టీ కోసం అనేక లక్షలు ఖర్చు చేశాం. కానీ నిర్వాహకులకు గౌరవం లేదు. సీమాన్ పార్టీ విధానానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. మతతత్వానికి మద్దతు ఇస్తున్నారు. ఇది మా నమ్మకాలకూ, విలువలకూ వ్యతిరేకం."

పార్టీకి చుక్కాన్నడిస్తున్న సీమాన్‌పై కార్యకర్తల్లో విస్తృత అసంతృప్తి వ్యక్తమవుతోంది. పునాది స్థాయి కార్యకర్తలు మరియు ముఖ్య నేతల రాజీనామాలు నామ్ తమిళర్ పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నార్థకచిహ్నం వేసేలా మారుతున్నాయి.

# మృతుల కుటుంబాలకు విజయ్ ఆర్థిక సాయం

**అన్నా నగర్ న్యూస్:** తమిళనాడు వెట్రి కలగం సదస్సులో పాల్గొన్న వారు ఇంటికి తిరిగి వెళ్తూ జరిగిన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, తమిళనాడు వెట్రి కలగం అధ్యక్షుడు విజయ్ ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ సందర్భంగా విజయ్, తమిళనాడు వెట్రి కలగం తరపున బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. అక్టోబర్ 27న జరిగిన తమిళనాడు వెట్రి కలగం రాష్ట్ర తొలి సదస్సులో లక్షలాది మంది వాలంటీర్లు పాల్గొన్నారు. సదస్సు ముగిసిన తరువాత ఇంటికి తిరుగు ప్రయాణంలో ప్రమాదంలో 6 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో చెన్నై, తిరుచ్చి, తిరువణ్ణామలై ప్రాంతాలకు చెందిన వసంతకుమార్, రియాజ్, చార్లెస్ తదితరులు ఉన్నారు. మృతుల కుటుంబాలకు



రూ.2 లక్షల సాయం అందించడంతో పాటు, వారి కుటుంబ పరిస్థితులను బట్టి కొందరికి అదనపు నిధులు, మృతుల పిల్లల చదువు ఖర్చులు కూడా విజయ్ అందిస్తారు.తగిన శ్రద్ధతో బాధిత కుటుంబాలకు సాయం అందజేయడం అభినందనీయమైన పని.

# పెంచిన పన్నులు ఉపసంహరించుకోవాలి: ఈ.పి.ఎస్



**గిండీ న్యూస్:** అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎడప్పాడి పళనిస్వామి (ఈ.పి.ఎస్) డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపూర్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను, తాగునీటి పన్ను, చెత్త పన్ను పెంపును వ్యతిరేకించారు. అలాగే, ఆస్తిపన్నును ప్రతి సంవత్సరం పెంచేందుకు డీఎంకే మేయర్ ప్రతిపాదించిన తీర్మానాలను ఆయన ఖండించారు. అన్నాడీఎంకే కౌన్సిలర్లు ఈ పన్నుల పెంపును కేవలం క్యాబినెట్ సమావేశంలో ఆమోదించాలని అభ్యర్థించినప్పటికీ, డీఎంకే మేయర్ ఈ ప్రతిపాదనను తిరస్కరించడమే కాకుండా, అపరాధ పన్ను, కొత్త జీఎస్టీ వంటి అదనపు భారాలను ప్రజలపై మోపుతున్నారని పళనిస్వామి విమర్శించారు. అద్దె భవనాలపై పన్నులు విధించడం, వీటికి వ్యతిరేకంగా ప్రజల అభ్యర్థనలను పట్టించుకోకుండా ప్రజావ్యతిరేకంగా తీర్మానాలను ఆమోదించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తిరుపూర్ కార్పొరేషన్‌లో నిరసన తెలిపిన వారికి పోలీసులు చేసిన అరెస్టులను కూడా పళనిస్వామి ఖండించారు. పెరిగిన పన్నులను వెంటనే ఉపసంహరించుకోవాలని, డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలన ప్రజలకు భారంగా మారిందని పళనిస్వామి అన్నారు. తన మాటల ద్వారా, పెరిగిన పన్నుల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధానంగా ప్రశ్నించిన పళనిస్వామి, డీఎంకే ప్రభుత్వంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.



# కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి!

**విల్లివాకం న్యూస్:** గుమ్మిడిపూండి సమీపంలోని రైస్‌మిల్లు నుంచి వచ్చే మురుగు నీరు కలుషితమై ఉక్కిరిబిక్కిరి అవుతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. గుమ్మిడిపూండి పక్కనే ఉన్న కురువట్టుచెరి గ్రామంలో కేవీఎస్‌టీ అనే ప్రైవేట్‌కు చెందిన మోడ్రన్ రైస్ మిల్లు నడుస్తోంది. ఈ మిల్లు ఉత్పత్తి సమయంలో, ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా బియ్యం ఉత్పత్తి చేయబడినందున ఆ పొగలో నల్లటి రేణువులు





కలిసి అక్కడి నివాసాలకు వ్యాపించి పలు రకాల నష్టం వాటిల్లిందని చెబుతున్నారు.

మరియు ఫలితంగా ఏర్పడే వాయు కాలుష్యం ఆ ప్రాంత ప్రజలకు ఊపిరాడకుండా అనేక రుగ్మతలకు మూల కారణం. పలుమార్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు జాప్యం చేస్తుండడంతో నిత్యం వివిధ రకాల సమస్యలు ఎదురవుతున్నాయని ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మోడ్రన్ రైస్ మిల్లును తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# రామ్మూర్తినాయుడి కర్మక్రియలు.. హాజరైన సీఎం చంద్రబాబు

**చంద్రగిరి:** నారావారి పల్లెలో సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్‌తో పాటు నారా కుటుంబసభ్యులు హాజరయ్యారు. రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీనటుడు నారా రోహిత్ కర్మక్రియలు నిర్వహించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు తెదేపా ఎమ్మెల్యేలు, నేతలు హాజరయ్యారు.



# డిసెంబరు 15న మహిళల ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ వేలం

మహిళల ప్రీమియర్ లీగ్ 2025 వేలం ప్రక్రియకి తేదీ ఖరారైంది. బెంగళూరు వేదికగా డిసెంబరు 15న వేలం నిర్వహించనున్నారు. ఈసారి హీథర్ నైట్, నాడిన్ డి క్లెర్క్, లారెన్ బెల్, స్నేహ్ రాణా పేర్లు వేలంలో నిలిచే వారి జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్ జట్లకు తలో రూ. 15 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఇది మినీ వేలం కావడంతో ఫ్రాంచైజీలు ప్రస్తుతం తమ వద్ద ఉన్న క్రీడాకారిణులను కొనసాగించడానికే మొగ్గు చూపాయి. యూపీ వారియర్స్ 15 మందిని రిటైన్ చేసుకోగా.. మిగిలిన నాలుగు ఫ్రాంచైజీలు 14 మందిని అట్టిపెట్టుకున్నాయి. నాలుగు స్లాట్లను




భర్తీ చేసేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ. 3.25 కోట్లు ఉండగా, ముంబయి ఇండియన్స్ దగ్గర రూ.2.65 కోట్లు ఉన్నాయి. రూ.2.5 కోట్లతో వేలానికి ఢిల్లీ క్యాపిటల్స్ వస్తుండగా.. గుజరాత్ జెయింట్స్ రూ.4.4 కోట్లతో సిద్ధమవుతోంది. ఇక ముగ్గురు ప్లేయర్స్ కోసం యూపీ వారియర్స్ రూ. 3.9 కోట్లతో సిద్ధంగా ఉంది.

# పీపీపీ విధానంలో టోల్ ప్లాజాల నుంచి 1.44 లక్షల కోట్లు వసూలు



**ఢిల్లీ:** జాతీయ రహదారులపై పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) ఏర్పాటైన కార్యకలాపాలు సాగిస్తున్న టోల్‌ప్లాజాల ద్వారా 2000 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రూ.1.44 లక్షల కోట్లను టోల్ ఫీజు రూపంలో ప్రభుత్వం వసూలు చేసిందని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గురువారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. టోల్‌ప్లాజాల వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా వెళ్లేందుకు వీలుగా ఫాస్టాగ్‌తో పాటు, ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నట్లు మరో ప్రశ్నకు గడ్కరీ సమాధానంగా చెప్పారు. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ఆధారిత టోల్ విధానం ఏ జాతీయ రహదారిపైనా ఇంకా అమల్లోకి రాలేదని చెప్పారు. అలాగే, జీఎన్ఎస్ఎస్‌కు అనుగుణంగా జాతీయ రహదారుల టోల్ రూల్స్, 2008కు ఈ ఏడాది సెప్టెంబర్‌లో సవరణలు చేసినట్లు చెప్పారు. ఈ విధానంలో ప్రయాణించిన దూరానికి మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టును బట్టి ఫీజు వసూలు విధానం అమలవుతోంది.

# బంగ్లాలో హిందువులపై దాడులు.. స్పందించిన షేక్ హసీనా

బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందూ వర్గాలపై, ఇస్కాన్ సాధువులపై జరుగుతోన్న దాడులపై మాజీ ప్రధాని షేక్ హసీనా స్పందించారు. సనాతన వర్గానికి చెందిన ఆధ్యాత్మిక వేత్తను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చిన్మయ్ కృష్ణదాస్ ప్రభు అరెస్టును పరోక్షంగా ప్రస్తావించిన ఆమె.. తాజాగా చిట్టగాంగ్‌లో ఆలయంపై దాడి జరగడంతోపాటు, వివిధ ప్రార్థనా మందిరాలపైనా దాడులు పెరిగాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, శాంతిభద్రతలను రక్షించడంలో తాత్కాలిక ప్రభుత్వం విఫలమైందని హసీనా ఆరోపించారు. దేశంలో మత స్వేచ్ఛతోపాటు అన్ని వర్గాల ప్రజల జీవితాలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై హసీనా ఆందోళన వ్యక్తం చేసినట్లు అవామీ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది.






# 'ఇస్కాన్'పై నిషేధానికి బంగ్లా కోర్టు నిరాకరణ

**ఢాకా:** ఇస్కాన్‌పై నిషేధించేందుకు బంగ్లాదేశ్‌లోని ఢాకా హైకోర్టు నిరాకరించింది. ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో హిందూ సంస్థ కార్యకలాపాలపై నిషేధం విధించాలన్న పిటిషనర్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. అయితే, దేశంలో ఇస్కాన్ ఇటీవలి కార్యకలాపాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందో నివేదిక ఇవ్వాలని అటార్నీ జనరల్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

మరోవైపు ఇస్కాన్ తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందని, దీనిపై నిషేధం విధించాలని పది మందితో కూడిన సుప్రీం కోర్టు న్యాయమూర్తుల బృందం అక్కడి ప్రభుత్వానికి లీగల్ నోటీసు పంపించింది. ఇటీవలి ఘర్షణల్లో ఓ న్యాయవాది మరణానికి కారణమైన వారిని విచారించాలని డిమాండ్ చేసింది. అయితే, ఇస్కాన్ హిందూ మతానికి చెందిన సంస్థ అని, దాని కార్యకలాపాలపై దృష్టి సారిస్తున్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఢాకా హైకోర్టుకు ఇటీవల తెలిపింది.

బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరిచారనే ఆరోపణలపై చిన్మయ్ కృష్ణదాస్ ప్రభును ఢాకా పోలీసులు అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిని వ్యతిరేకిస్తూ అక్కడి హిందువులు పెద్దఎత్తున నిరసనలు చేపడుతున్నారు. అయితే, గతంలో ఇస్కాన్‌లో క్రియాశీలంగా ఉన్న చిన్మయ్.. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా అన్ని పదవులకు దూరమైనట్లు సమాచారం.

మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్‌లో విచారణ జరపాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ ఆదేశించారు. ఐసీసీ ప్రాసిక్యూటర్ కరీం ఏ ఖాన్‌తో ఈ అంశంపై చర్చించినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. షేక్ హసీనాపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే 150కిపైగా కేసులు నమోదైన విషయం తెలిసిందే.